*Pls use news Item*

*అటవీ ప్రభావిత జిల్లాల్లో ముమ్మరంగా పోలీస్, రెవెన్యూ, అటవీ శాఖల ఉమ్మడి సమావేశాలు*

*కొనసాగుతున్న తనిఖీలు, ఏర్పాటవుతున్న చెక్ పోస్టులు, సా మిల్లుల తనిఖీపై ప్రత్యేక దృష్టి*

*జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిల్లో అటవీ రక్షణ కమిటీల ఏర్పాటు, సమావేశాలు*

ఎట్టి పరిస్థితుల్లో అడవిని, అటవీ సంపదను కాపాడాల్సిందేనన్న ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాల్లో యంత్రాంగం కదిలింది. అటవీ ప్రభావిత జిల్లాల్లో ముమ్మరంగా అనుమానిత ప్రాంతాల్లో సోదాలు, సా మిల్లుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. కొత్తగా ఫారెస్ట్, పోలీస్ ఉమ్మడి చెక్ పోస్టులను జిల్లాల వారీగా ఏర్పాటు చేస్తున్నారు. ఆయా  జిల్లాల్లో కలెక్టర్ ఆధ్వర్యంలో  ఏర్పాటైన ఫారెస్ట్ ప్రొటెక్షన్ కమిటీల సమావేశాలు కూడా జరుగుతున్నాయి. జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిల్లో కూడా ఈ కమిటీల ఏర్పాటు జరగాలని, అటవీ సంపదను స్మగ్లర్లు, వేటగాళ్ల నుంచి రక్షించే చర్యలు ముమ్మరం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో అదిలాబాద్, జగిత్యాల జిల్లాల్లో కలెక్టర్, ఎస్పీ, డీ.ఎఫ్.ఓ నేతృత్వంలో సమావేశాలు జరిగాయి. ప్రతీ మండలం, గ్రామాల వారీగా అటవీ ప్రాంతాలను గుర్తించటం, స్మగ్లింగ్, వేటకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో గస్తీని ముమ్మరం చేయటంపై ఈ సమావేశాల్లో చర్చించారు. ఆ జిల్లాలకు చెందిన రెవెన్యూ అధికారులు కూడా ఈ సమావేశాల్లో పాల్గొన్నారు. మొన్నటి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చీఫ్ సెక్రటరీ వెల్లడించిన విషయాలను, క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బందికి ఈ సమావేశాల్లో ఉన్నతాధికారులు వెల్లడించారు. అలాగే జిల్లాల వారీగా అటవీ అటవీ రక్షణ ప్రణాళికలను ఫిబ్రవరి ఆరులోగా పంపాలని చీఫ్ సెక్రటరీ ఆదేశించటంతో జిల్లాల యంత్రాంగం దానిపై దృష్టి పెట్టింది. ఉన్న అటవీ ప్రాంతం ఎంత, సరిహద్దులు సక్రమంగా ఉన్నాయా, ఆక్రమిత అటవీ భూములు ఎన్ని, వ్యూహాత్మక చెక్ పోస్టులు ఏ ప్రాంతంలో ఉంటే ప్రయోజనం, ఉన్న సిబ్బందిని అత్యంత ప్రయోజనకరంగా వాడుకోవటం ఎలా, అటవీ ప్రాంతంలో ఉన్న బేస్ క్యాంపులు ఎన్ని, స్ట్రయికింగ్ ఫోర్స్ లు ఎన్ని ఉన్నాయి.. ఇలా అన్ని విషయాలను అటవీ భవన్ నుంచి ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నారు. పోలీస్, ఫారెస్ట్ ఉమ్మడి చెక్ పోస్టులు 54 అవసరమని గుర్తించగా, ఇప్పటికే 40 చోట్ల వీటిని సాయుధ పోలీసులతో ఏర్పాటు చేశారు.  గత 20 రోజులుగా జరుగుతున్న సోదాల వివరాలు చూసినట్లయితే.. 554 గ్రామాలు, ప్రాంతాల పరిధిలో 387 సా మిల్లుల్లో తనిఖీలు నిర్వహించారు. 528 కార్పెంటర్లను ఆరా తీశారు. 309 దూగోడ మిషన్లను చెక్ చేయగా,  అదే పనిగా అటవీ నేరాలకు  పాల్పడుతున్నారనే అనుమానంతో 33 మందిని విచారించారు. అదిలాబాద్ లో 2, కొత్తగూడెంలో 3 పీడీ కేసులను నమోదు చేశారు.  వివిధ తీవ్రత గల 449 కేసులను ఇప్పటి దాకా బుక్ చేశారు. వివిధ ప్రాంతాల్లో సుమారు 480 క్యూబిక్ మెట్రిక్ టన్నుల, 70 లక్షల రూపాయల విలువైన

కలపను అటవీ శాఖ స్వాధీనం చేసుకుంది. ఇక అటవీ రక్షణకు సంబంధించి 544 ప్రాంతాల్లో అవగాహనా సదస్సులను కూడా నిర్వహించినట్లు ఉన్నతాధికారులు  వెల్లడించారు. అటవీ రక్షణ చర్యలను సమీక్షించేందుకు అన్ని ప్రాంతాలకు చెందిన చీఫ్ కన్జర్వేటర్లతో శుక్రవారం అరణ్య భవన్ లో సమావేశం జరగనుంది.

ఫోటో రైటప్ వివరాలు.. 1. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఏర్పాటైన ఉమ్మడి చెక్ పోస్టు, 2. జగిత్యాల జిల్లా అటవీ సంరక్షణ సంయుక్త సమావేశం, పాల్గొన్న కలెక్టర్ శరత్, పోలీస్, అటవీ అధికారులు 3. అదిలాబాద్ జిల్లా అటవీ సంరక్షణ సంయుక్త సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ దివ్య. పోలీస్, అటవీ అధికారులు.